



# శాండిల్య భక్తి సూత్రాలు

పూజ్యగురుదేవులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారి


ప్రవచన భాష్య ఆధారము, బృందావనం 30th Oct 2022 – 7th Nov 2022



శ్రీగురుభ్యోనమః విద్యార్థుల సేకరణ

26TH AUGUST 2023 మురళి

29TH SEPTEMBER 2023 మురళి



## ప్రథమోధ్యాయ:

## ప్రథమ ఆహ్నికం

**సూత్రము 1: అథాతో భక్తిజిజ్ఞాస**

**తాత్పర్యము: అందువలన (సంసారం గొప్పది కాదు అని తెలుసుకొని), తగిన అధికారము ఏర్పడిన తరువాత, భక్తి గురించి ఏకాగ్రతతో కూడిన జిజ్ఞాసతో (పురుషార్థ సాధన కోసం - అంటే మోక్షము కోసము) తెలుసుకోవడం.**

**సూత్రము 2: సా పరానురక్తిరీశ్వరే**

**తాత్పర్యము: ఈశ్వరుని యందు ఉన్న పరానురక్తికి భక్తి అని పేరు.**

**సూత్రము 3: తత్సంస్థస్య అమృతోపదేశాత్**

**తాత్పర్యము: పరమాత్మ యందు నిశ్చలముగా అచలముగా కూర్చోవడం వలన ఆ భక్తునికి అమృతత్వం లభిస్తుంది అని శాస్త్రము చెప్పింది.**

సూత్రము 4: జ్ఞానమితి చేన్న ద్విషతోపి జ్ఞానస్య తత్ అసంస్థిథే:

తాత్పర్యము: అయితే పరమాత్మ యందు ఉండడం (నిశ్చలముగా అచలముగా కూర్చోవడం) అన్నది జ్ఞానం వలన సాధ్యం కాదు. ప్రేమ వలనే సాధ్యం అవుతుంది.

సూత్రము 5: తయోపాక్షాయాచ్ఛ

తాత్పర్యము: భక్తి ముందు జ్ఞానం క్షీణిస్తుంది. భక్తితో ఉన్నప్పుడు జ్ఞానం ఉన్నప్పటికీ పట్టదు. ఉదాహరణ: కృష్ణుడు పరమేశ్వరుడు అని తెలిసినా యశోదమ్మకు పట్టదు, తన కుమారుడు అనే భావములోనే ఉంటుంది. జ్ఞానం కంటే భక్తి గొప్పది. తత్వజ్ఞానం వలన భక్తి కలుగుతుంది, పరమాత్మను పొందాలి అనే కోరిక కలుగుతుంది. ఆ కలిగిన భక్తితోనే పరమాత్మను పొందగలరు.

సూత్రము 6: ద్వేష ప్రతిపక్ష భావాత్ రస శబ్దాశ్చ రాగ:

తాత్పర్యము: ద్వేషానికి ప్రతిపక్షం రాగము. ద్వేషానికి విరుద్ధమైనది మరియు రసముతో కూడి ఉన్నది అందుకని రాగము అని పేరు పెట్టాను. పర దేహములయందు ఉన్న పరమాత్మను ద్వేషించటం కూడా ద్వేషమే

(పర దేహములను అంటే వేరే ప్రాణులను ద్వేషించడం కూడా తగదు మరియు మన ఇష్టదైవము కాకుండా వేరే సగుణ రూపములో ఉన్న పరమాత్మను ద్వేషించడం కూడా తగదు).

సూత్రము 7: న క్రియా కృత్యనపేక్షనజ్ఞానవత్

తాత్పర్యము: భక్తి క్రియ కాదు, కర్మ కాదు. పరాభక్తి స్థితికి వెళ్ళినవారు స్వాభావికంగా శరీర స్థితిని పాటిస్తారు కానీ ఫలం కోసం కర్మలు చేయరు.

సూత్రము 8: అత ఏవ చ ఫల అనంత్యం

తాత్పర్యము: పరాభక్తి వలన లభించే ఫలం అనంతం. పరాభక్తికి ఫలం మోక్షము.

సూత్రము 9: తద్వత: ప్రపత్తి శబ్దాచ్చ న జ్ఞానం ఇతర ప్రపత్తివత్

తాత్పర్యము: జ్ఞాని ప్రపత్తి పొందుతాడు అనే మాట ఉంది కదా శాస్త్రంలో. అన్నీ తెలిసినవాడు (జ్ఞాని) అన్నీ పరమాత్మయే అని పట్టుకుంటున్నాడు. జ్ఞానం వలన భక్తి తద్వారా ముక్తి పొందవచ్చు. భగవద్గీత జ్ఞానవిజ్ఞానయోగములోని 19 శ్లోకము ప్రమాణము.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే|
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ||

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------





## ప్రథమోధ్యాయ:

## ద్వితీయ ఆహ్నికం

### సూత్రము 10: సా ముఖ్య ఇతర అపేక్షితత్వాత్

తాత్పర్యము: గౌణ భక్తి లేనిదే ఇంకేదీ పొందలేడు. గౌణ భక్తిలో కొన్ని రూపాలు - పూజ, జపము, శాస్త్ర అధ్యయనము, మొదలగునవి. పరాభక్తికి ఇవేమి అవసరము లేదు; అంటే ఇవేమి చెయ్యద్దు అని కాదు, పరాభక్తులు ఇవన్నీ స్వాభావికంగా చేస్తారు. పరాభక్తులు ఫలాపేక్ష లేకుండా, నేను చేస్తున్నా అనే స్పృహ లేకుండా, పరమాత్మ యందే చిత్తాన్ని పెట్టి స్వాభావికంగా శరీర నిర్వహణకు ఇవన్నీ చేస్తారు.

### సూత్రము 11: ప్రకరనాచ్చ

తాత్పర్యము: ఆత్మ గురించి చెప్పేటపుడు శాస్త్రంలో ఇదే చెప్పారు (లేక ఇంతే చెప్పారు).

**సూత్రము 12: దర్శన ఫలమితి చేన్న తేన వ్యవధానాత్**

**తాత్పర్యము: పరాభక్తుడు బ్రహ్మమునే చూస్తూ మననం చేస్తూ ఆత్మరతిని (ఆత్మానందాన్ని) అనుభవిస్తున్నాడు.**

**సూత్రము 13: దృష్టత్వాచ్చ**

**తాత్పర్యము: ప్రీతి, చూడడం వలన ఏర్పడుతుంది.**

**సూత్రము 14: అత ఏవ తద్భావాత్ వల్లవీనాం**

**తాత్పర్యము: ఆ భావము (ప్రీతి) వలన ఆ స్థితిని(పరాభక్తిని) పొందిన వాళ్ళు గోపికలు.**

**సూత్రము 15: భక్త్యా జనాతి ఇతిచేత్ న అభిజ్ఞాయ సాహాయాత్**

**తాత్పర్యము: భక్తితోనే పరమాత్మ యదా స్వరూపము తెలియబడుతుంది. భగవద్గీత మోక్షసన్యాసయోగములోని 55 శ్లోకము ప్రమాణము.**

భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః |
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ||55||

## సూత్రము 16: ఏతేన వికల్పోపి ప్రత్యుక్త:

తాత్పర్యము: జ్ఞానము వలన భక్తి వచ్చి ఆ భక్తిలో జ్ఞానము లీనమవుతుంది. ఆ స్థితిలో అదా లేక ఇదా అనే వికల్పము ఉండదు. ఉన్నది పరమాత్మ ఒక్కటే అని స్పష్టముగా తెలుస్తుంది.

## సూత్రము 17: దేవ భక్తి ఇతరస్మాత్ సాహచర్యాత్

తాత్పర్యము: పరాభక్తి ఉత్కృష్టమైన పరమాత్మయందు ఎలా ఉందో గురువు యందు కూడా అలానే ఉండాలి.

## సూత్రము 18: భక్తి: ప్రమేయా శ్రుతిభ్య:

తాత్పర్యము: భక్తికి ప్రమాణము వేదము. వేదము భక్తిని బోధించింది. వేదముల తాత్పర్యము పరాభక్తి.

## సూత్రము 19: పురాణేతిహాసాభ్యాంచ ఇతిహ్

తాత్పర్యము: పురాణ ఇతిహాసాలు కూడా భక్తిని ప్రతిపాదించాయి.

**సూత్రము 20: పృధు ధ్రువ ప్రహ్లాద అంబరీష శుఖ సనక నారద భజనచారశ్చ**

తాత్పర్యము: పృధు, ధ్రువ, ప్రహ్లాద, అంబరీష, శుఖ, సనక, నారదులవారు - వీరందరూ కూడా భక్తికి ప్రమాణములు. వీరు భక్తికి ఆచార్యులు.

**సూత్రము 21: యోగస్తూభయార్తమపేక్షణాత్  ప్రాయాజాదివత్**

తాత్పర్యము: యోగము కూడా భక్తిని ప్రతిపాదించింది. గౌణ భక్తితో (సాత్విక భక్తితో) కూడిన యోగము ద్వారా భగవత్ జ్ఞానము కలిగి, ఆ జ్ఞానము ద్వారా పరాభక్తి సిద్ధించి తద్వారా ముక్తి లభిస్తుంది. కనుక భక్తికి జ్ఞానానికి యోగము కావాలి. భక్తి లేని యోగం, జ్ఞానం లేని యోగం వ్యర్థము.

**సూత్రము 22: గౌణ్యాతు సమాధి సిద్ధి:**

తాత్పర్యము: సమాధి సిద్ధించాలి అంటే పరమాత్మ యందు గౌణ భక్తితో ఉండాలి. యోగము పరమార్థము కాదు, పరమార్థమునకు సహకరిస్తుంది. సమాధి స్థితి కంటే పరాభక్తి గొప్పది.

## సూత్రము 21: హేయ రాగత్వాత్ ఇతిచేత్ న ఉత్తమ్మాస్పదత్వాత్ సంగవత్

తాత్పర్యము: లౌకిక విషయాలపట్ల రాగము అల్పము. కానీ ఇక్కడ చెప్తున్న రాగము (పరాభక్తి) పరమాత్మను ఆశ్రయించి ఉంది గనుక హేయము కాదు.

## సూత్రము 22: తదేవ కర్మ జ్ఞాని యోగిభ్య: ఆధిక్యశబ్దాత్

తాత్పర్యము: కర్మ, యోగము, జ్ఞానము కంటే భక్తి గొప్పది అని శాస్త్ర ప్రమాణము కలదు. భగవద్గీత ఆత్మసంయమయోగములోని 46 & 47 శ్లోకములు ప్రమాణములు.

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః |
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ||

యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా |
శ్రద్ధావాన్భజతే యో మాం స మే యుక్తతమో మతః||

## సూత్రము 23: ప్రశ్న నిరూపణాభ్యాం ఆధిక్య సిద్ధే:

తాత్పర్యము: ప్రశ్నించడం, దానిని సమాధానంతో నిరూపించడం, ఆ మార్గము ద్వారా కూడా భక్తి ఆధిక్యతను తెలిపారు.

## భగవద్గీత భక్తియోగములోని 1, 2, 3, 4, 5, 6 & 7 శ్లోకములు ప్రమాణములు.

**అర్జున ఉవాచ**

ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।

యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః॥ 1 ॥

**శ్రీ భగవానువాచ**

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।

శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥2॥

యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే ।

సర్వత్ర గమచిన్త్యంచ కూటస్థమచలం ధ్రువమ్ ॥3॥

సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః |

తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥4॥

క్లేశోఽధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ !

అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥5॥

యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః।

అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥6॥

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।

భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥7॥

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।

## సూత్రము 24: నైవ శ్రద్ధాతు సాధారణ్యాత్

**తాత్పర్యము: శ్రద్ధ అన్నిటికీ ఉండాలి. కర్మ, యోగము, జ్ఞానము, భక్తి - వీటన్నిటికీ శ్రద్ధ అవసరము.**

## సూత్రము 25: తస్యాం తత్వేచ అనవస్థానాత్

**తాత్పర్యము: సర్వ సాధనల శేష ఫలము భక్తియే. అయితే అది తెలియజేసేటపుడు అప్రామాణిక విషయాలు కూడా చెప్పవలసి వస్తుంది. దాంతో అసలు విషయం గ్రహించలేము.**

## సూత్రము 26: బ్రహ్మకాండం తు భక్తౌ తస్య అనుజ్ఞానాయ సామాన్యాత్

తాత్పర్యము: బ్రహ్మఖాండ కూడా భక్తిని తెలియజేయటానికే వచ్చింది. భక్తిని కలిగించడానికే ఉపనిషత్తులు వచ్చాయి. కర్మ చేయటానికీ మరియు జ్ఞానానికీ భక్తియే కావాలి. శాస్త్రీయముగా బ్రహ్మమును తెలుసుకొనే పద్ధతిలో భక్తియే ప్రధానముగా కనపడుతున్నది.

-----------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------





## ద్వితీయ అధ్యాయము

## ప్రథమ ఆహ్నికం

**సూత్రము 27: బుద్ధి హేతు ప్రవృత్తి: ఆవి శుద్దే: అవఘాతవత్**

**తాత్పర్యము: భగవంతునియందు బుద్ధి లగ్నమయ్యేంతవరకు, గౌణభక్తి పరాభక్తి అయ్యేంతవరకు, పరమాత్మ దొరికేంతవరకు సాధన మానరాదు.**

**సూత్రము 28: తదంగానాంచ**

**తాత్పర్యము: శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమాహిత మనస్క - ఇవి సాధనకు అంగాలు. ఇవి ఉంటేనే సాధన సిద్ధిస్తుంది. శమము, దమము అంటే అంతరంగ బహిరంగ ఇంద్రియ నిగ్రహము. ఉపరతి అంటే అంతర్ముఖుడు. తితిక్ష అంటే ఓర్పు కలిగి ఉండడము, సుఖానికి**

పొంగిపోకుండా దుఃఖానికి కృంగిపోకుండా ఉండడం. సమాహిత మనస్క అంటే పరమాత్మయందు ఏకాగ్ర మనస్సు కలిగి ఉండుట.

సూత్రము 29: తాం ఐశ్వర్యపరామ్ కాశ్యప పరత్వాత్

తాత్పర్యము: బుద్ధి పరమేశ్వర పరమైనపుడు మాత్రమే భక్తి, తద్వారా ముక్తి లభిస్తుంది అని కాశ్యప ఋషి అన్నారు.

సూత్రము 30: ఆత్మైకపరాం బాదరాయణ:

తాత్పర్యము: పరమాత్మ నాలో ఆత్మ యే అని బాదరాయణుడు అన్నారు.

సూత్రము 31: ఉభయపరామ్ శాండిల్య: శబ్దోపపత్తిభ్యాం

తాత్పర్యము: పైన చెప్పిన కాశ్యపుడిది మరియు బాదరాయణుడిది రెండు కూడా సత్యాలే అని శాండిల్య మహర్షి అన్నారు. కాశ్యప ఋషి దాసోహం అన్నారు, బాదరాయణుడు సోహం అన్నారు. భగవద్గీత రాజవిద్యారాజగుహ్యాయోగములోని 15 శ్లోకము ప్రమాణము.

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ||

సూత్రము 32: వైశమ్యాద్ అసిద్ధమితిచేన్నప్రత్యభిజ్ఞానవద్ అవైశిష్ట్యాత్

తాత్పర్యము: వైషమ్యాలు చెప్పిన ప్రతిదాంట్లో ప్రత్యేక (customized) లక్షణాలు మరియు సామాన్య (common) లక్షణాలు అని ఉంటాయి. సామాన్య లక్షణము స్వీకరించి వైషమ్యాలు విస్మరిస్తే ఆ ఏకత్వం తెలుస్తుంది. సర్వజ్ఞుడు, అల్పజ్ఞుడు, ఈ రెండింటిలో సర్వ అల్ప వైషమ్యాలు అయితే జ్ఞానము సామాన్యము. రెండు విభిన్న మాటలుగా కనపడుతున్నా అందులో సామాన్యముగా ఉన్నది స్ఫురిస్తుంది.

సూత్రము 33: న చ క్లిష్ట: పరస్యాద్ అనంతరం విశేషాత్

తాత్పర్యము: శరీరములో ఈశ్వరుని చైతన్యము ఉన్నప్పటికీ ఈ శరీర సుఖదుఃఖాలు ఈశ్వరునికి అంటవు. సూర్యకాంతి అద్దంలో పడినపుడు ఆ అద్దానికి వేడి వెలుగు వచ్చాయి. ఆ అద్దము ముక్కలయితే సూర్యునికి ఏమి కాదు. అద్దముకున్న వికారాలు సూర్యునికి అంటవు. సూర్యుడులేనిదే అద్దానికి వెలుగు వేడి లేదు. ఉపాధి తాదాత్మ్యం విడిచినవాడికి క్లేశము లేదు.

సూత్రము 34: ఐశ్వర్యం తథేతిచేన్న స్వాభావ్యాత్

తాత్పర్యము: ఈశ్వరుని ఐశ్వర్యం స్వాభావికం, సహజం, ఎప్పుడూ ఉంటుంది, ఎక్కడినుంచో రాలేదు, తగ్గిపోదు, సంపూర్ణంగా ఉంటుంది. జీవుడిలో విభూతులు కనపడినా అవి జీవుడి సహజ స్వభావం కాదు. పూర్వ పుణ్యం చేత అంతఃకరణం శుద్ధి అయి ఈశ్వరుని కాంతి ఎక్కువగా ఆ శరీరముయందు ప్రసరించడంచేత కలిగిన విభూతి మాత్రమే గానీ ఆ జీవుడి సొంతము కాదు.

సూత్రము 35: అప్రతిశిద్ధం పరమైశ్వర్యం తద్భావాచ్చ నైవమితరేషామ్

తాత్పర్యము: ఈశ్వరుని ఐశ్వర్యం మార్పుచెందదు, నశించదు.

సూత్రము 36: సర్వామృతే కిమితిచేస్ నైవం బుద్ధ్యా అనంత్యాత్

తాత్పర్యము: ఇంత తత్వాన్ని విని అందరూ ముక్తిపొందుతారా ఇక జీవులే ఉండరా ఇక సృష్టియే ఉండదా అన్న ప్రశ్నయే లేదు. అందరి బుద్ధి ఒకటి కాదు. ఒక్కొక్కరికి ఒక్కోలాగా అర్ధమవుతుంది. సర్వ జీవులకు ఒకేసారి మోక్షము రాదు. సామూహిక మోక్షము లేదు.

సూత్రము 37: ప్రకృత్యంతరాలాత్ అవైకర్యం చిత్సత్వేన అనువర్తనాత్

తాత్పర్యము: ప్రకృతిలో రకరకాల బుద్ధులు మరియు ఉపాధులు ఉంటాయి. వాటన్నిటిలో సామాన్యముగా సత్ చిత్ ఉంది. ఈ సత్ చిత్ అంతటా అన్నిటిలోనూ వదలకుండా, మారిపోకుండా, మార్పు చెందకుండా, విడిపోకుండా ఉంది. శరీరములో పుట్టడము, చావడము, ఆకలి అన్నవి ప్రకృతివి. ఉనికి, చైతన్యము ఈశ్వరునివి. శరీరాన్ని పగలగొట్టకుండా జాగ్రత్తగా లోపల ఉన్న ఈశ్వరుణ్ణి తెలుసుకోవాలి.

సూత్రము 38: తత్ ప్రతిష్ఠా గృహ పీటవత్

తాత్పర్యము: ఫలానా మనిషి ఇంట్లోనే ఉన్నాడు అని అంటాముగానీ ఇంట్లో ఉన్న గదిలో ఉన్న పీటమీద కూర్చొనివున్నారు అని ఎలా అనమో; ఈశ్వరుడు ప్రకృతిలో ఉన్నాడు అని అంటాముగానీ ప్రకృతిలో ఉన్న సర్వజీవుల్లో చిత్ సత్ రూపములో ఉన్నాడు అని అనము.

సూత్రము 39: మిథోపేక్షనాద్ ఉభయం

తాత్పర్యము: సృష్టికి కారణం ప్రకృతియా లేక ఈశ్వరుడా? సృష్టికి కారణం ప్రకృతి! ప్రకృతికి కారణం ఈశ్వరుడు! పరమాత్మ తప్ప మరొకటి లేదు,

పరమాత్మ కంటే గొప్పది ఇంకొకటి లేదు అని తెలిసి ఆ పరమాత్మను పట్టుకొని భక్తితో ఆరాధించడానికి ఈ జ్ఞానము అవసరము.

సూత్రము 40: చేత్యాచితోర్న తృతీయం

తాత్పర్యము: జడమైన ప్రకృతి మరియు చైతన్యమైన ఈశ్వరుడు తప్ప మూడోది లేదు.

సూత్రము 41: యుక్తౌ చ సమ్పరాయాత్

తాత్పర్యము: ప్రకృతి అనేకం. ఈశ్వరుడు ఏకం. అనేకమైన ఆ శక్తి ఈశ్వరుడిది. అనేకం లో ఏకం ఉందని తెలుసుకో! అనేకంగా కనపడుతున్న ఈ ప్రకృతిలో ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు. సృష్టి చేసేటపుడు ఈశ్వరుడు తన శక్తితో అనేకమయ్యాడు. సృష్టి ముగిసాక ఈశ్వరునిలోకి అనేకం(కనపడుతున్న జగత్) వెళ్ళిపోతుంది/లీనమవుతుంది. శక్తి ఈశ్వరునిలో ఎప్పుడూ ఉంది.

సూత్రము 42: శక్తిత్వాత్ న అనృతం చేత్యమ్ (వేద్యం)

తాత్పర్యము: సర్వము చేయగలిగిన శక్తి బ్రహ్మములో సహజముగా ఉంది. జగత్తుగా వ్యక్తము అవ్వగలిగే సర్వ సమర్ధత పేరు శక్తి, అది మూల ప్రకృతి, అవ్యక్తమైనది. వ్యక్తము అయితే జగత్తుగా(ప్రకృతి) తెలుస్తుంది. వ్యవహార దృష్టిలో జగత్ ఉంది. పరమాత్మ దృష్ట్యా జగత్ లేదు, అది మిథ్య. మిథ్య అన్నారు గానీ అసత్యము అనలేదు.

సూత్రము 43: తద్ పరిశుద్ధిస్తు గమ్యా: లోకవల్లింగేభ్య:

తాత్పర్యము: శుద్ధమైన భక్తి కలిగితే లోక వ్యవహారమువలే కొన్ని గుర్తులు కనపడతాయి దానితో వారిని పోల్చుకోవచ్చు.

సూత్రము 44: సమ్మాన బహుమాన ప్రీతి విరహేతర విచికిత్స మహిమాఖ్యాతి తదర్ధ ప్రాణ స్థాన తదీయతా సర్వతద్ భావా ప్రతికూల్యాదినిచ స్మరణేభ్యో బాహుల్యాత్

తాత్పర్యము: 12 రకాల గుర్తులు ప్రధానముగా చెప్పారు భక్తిని పోల్చుకోవడానికి:

1. సమ్మాన - సంపూర్ణముగా గౌరవించుట, ఉదాహరణ: పరమ భక్తి ఉన్న అర్జునుడు.

2. బహుమాన - అనేక విధములుగా గౌరవించుట, ఉదాహరణ: కృష్ణుణ్ణి గుర్తుచేసేవాటిని కూడా ప్రేమించే ఇక్ష్వాకు.
3. ప్రీతి - తలచుకున్నా ఆనందించడం, ఉదాహరణ: విదురుడు.
4. విరహ - కాలాతీత విరహము, వియోగం తట్టుకోలేరు. ఉదాహరణ: గోపికలకు క్షణాలు యుగాలు అయ్యాయి కృష్ణుడు కనిపించి అదృశ్యం అయ్యాక.
5. ఇతర విచికిత్స - స్వామి తప్ప ఇంకెవరు ఇచ్చినా తీసుకోరు. ఉదాహరణ: ఉపమన్యు పాలు కావాలి అని మొదట తపస్సు చేయడం ప్రారంభం చేసినా తరువాత జ్ఞానం కలిగింది. ఈశ్వరుడే ఇంద్రునిలాగా వచ్చి పాలు తీసుకో అంటే, నాకు ఒద్దు ఈశ్వరుడు ఇస్తేనే తీసుకుంటాను ఇంకెవ్వరు ఇచ్చినా తీసుకోను అని అంటాడు.
6. మహిమ - ప్రేమ వలన ఈశ్వర గొప్పతనం గురించి చెప్పడం. ఉదాహరణ: యముడు నరకంలో బాధపడుతూ బ్రతికుండగా కేశవుణ్ణి ఆరాధిస్తే క్లేశము ఉండదుగా అని ఈశ్వర గొప్పతనము చెప్తూంటారు.
7. ఖ్యాతి - కీర్తి ప్రకటించడం. ఉదాహరణ: యముడు భటులతో సమావేశములో ఈశ్వర కీర్తి తెలియజేస్తూ మధుసూదన భక్తులను విడిచిపెట్టండి అని అంటారు.

8. తదర్థ ప్రాణ స్థితి - ఈశ్వరుని కోసమే జీవించడం, ప్రాణములు ఈశ్వరుని కోసమే. ఉదాహరణ: ఆంజనేయ స్వామి. సరయు నదిలోకి ప్రవేశించేటపుడు శ్రీరాముడు ఆంజనేయునితో భూమి యందు ఉండు అని అన్నారు, అప్పుడు ఆంజనేయ స్వామి రామ కథ ఎంతవరకూ వినపడుతుందో అంతవరకూ ఉంటాను అని అంటారు. ఉత్తరఖాండ 100 శ్లోకములో ఆంజనేయ స్వామి పలికిన ఈ మాటలు కలవు.
9. తదీయతా - ఈశ్వరునికి చెందినవే అన్ని (ఆర్జించినవి, లభించినవి). ఉదాహరణ: మహాభారతం శాంతి పర్వంలో ఉపరిచరవసువు మహారాజు, బలి చక్రవర్తి.
10. సర్వమయత్వ జ్ఞానం - సర్వం ఈశ్వర మయం. ఉదాహరణ: ప్రహ్లాదుడు. అందుకే ద్వేషము లేదు, సర్వ జీవులయందు ఆ విష్ణువునే చూస్తూ ఉండటం వలన ద్వేషము లేదు.
11. అప్రాతికుల్యము - ఈశ్వరుడు ఏమి చేసినా స్వీకరించడం. ఉదాహరణ: భీష్ముడు స్వామి చేతిలో మరణానికి అయినా సిద్ధమే.
12. బాహుల్యాత్ - పైన చెప్పినవే కాకుండా ఇంకా ఎన్నో రకాలు ఉన్నాయి. ఉదాహరణ: ఉద్ధవుడు చూపించిన భక్తి మరియు నారదుడు చూపించిన భక్తి.

## సూత్రము 45: ద్వేషాదయస్తు నైవం

తాత్పర్యము: భగవంతుని యందు భక్తికి రకరకాల లక్షణాలు ఉన్నాయి గానీ అందులో ద్వేషము లేదు. ద్వేషము భక్తిలో ఒక రకము కాదు.

## సూత్రము 46: తద్వాక్యశేషాత్ ప్రాదుర్భావేష్వపి స

తాత్పర్యము: భగవంతుడు నిర్గుణము గనుక సగుణముగా వచ్చిన అవతారములు ఉపాసిస్తే తక్కువ స్థాయి అని అనడానికి లేదు. భగవంతుని అవతారములలో ఉన్న భక్తి కూడా గొప్ప భక్తియే. ఆ భక్తి, పరా భక్తి యే. నిర్గుణము అయినా సగుణము అయినా బ్రహ్మమే. మంచు కరిగితే నీరు, నీటిలోను మంచులోను ఒకే పదార్థం ఉంది. భగవద్గీత జ్ఞానవిజ్ఞానయోగములోని 21 శ్లోకము ప్రమాణము.

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి|
తస్య తస్యాచలాం శ్రద్ధాం   తామేవ విదధామ్యహమ్ ||

## సూత్రము 47: జన్మ కర్మ విదశ్చ అజన్మ శబ్దాత్

తాత్పర్యము: దివ్యమైన పరమాత్మ అవతారములు ఉపాసిస్తే వారికి మరి జన్మ లేకుండా పరమాత్మ ఉద్ధరిస్తారు. నదిలో కొట్టుకుపోయేవాడిని

కాపాడడానికి గజఈతగాడు దిగినట్టు మనల్ని ఈ సంసారమునుండి రక్షించడానికి పరమాత్మ అవతారము స్వీకరించినంత మాత్రాన మనలాంటి మనిషి కాదు. పరమాత్మ అవతారములు దివ్యమైనవి. భగవద్గీత జ్ఞానయోగములోని 6 & 9 శ్లోకములు ప్రమాణము.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సస్ |
ప్రకృతిం స్వామధిష్ఠాయ సమ్భవామ్యాత్మమాయయా ||

జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః |
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ||

సూత్రము 48: తత్ చ దివ్యం స్వశక్తి మాత్రోద్భవాత్

తాత్పర్యము: పరమాత్మ దివ్యత్వము పరమాత్మ యొక్క స్వశక్తి (సహజమైన పరమాత్మ శక్తి). ఆ స్వశక్తితోనే అవతారములలో ఉద్భవించాడు. ఆ స్వశక్తియే మాయ.

సూత్రము 49: ముఖ్యం హి తస్య కారుణ్యం

తాత్పర్యము: భగవంతుడు అవతారములు కారుణ్యంతో ధరించాడు. భగవద్గీత కర్మయోగములోని 22 శ్లోకము ప్రమాణము.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కిఞ్చ న |
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి||

సూత్రము 50: ప్రాణిత్వాత్ న విభూతిషు:

తాత్పర్యము: పరమాత్మ విభూతి కిరణము మాత్రమే. విభూతి యందు భక్తి ముక్తిని ఇవ్వదు. ఎందుకంటే అక్కడ జీవ భావము ఉండడం వలన.

సూత్రము 51: ద్యూత రాజ సేవయో: ప్రతిషేదాశ్చ

తాత్పర్యము: ద్యూతము మరియు రాజుని విభూతిగా చెప్పారు కానీ అవి నిషేధము వాటిని ఉపాసించరాదు. మరి రాముడు కృష్ణుడు కూడా విభూతిలే కదా అంటే అవి పూర్ణ పరమాత్మ తత్వము గనుక ఉపాసించడం వలన ముక్తి లభిస్తుంది.

సూత్రము 52: వాసుదేవేపి ఇతి చేన్నాకార మాత్రత్వాత్

తాత్పర్యము: మనుష్య ఆకారములో కనపడినంత మాత్రాన వాసుదేవుడు కూడా విభూతి అని అనుకోకూడదు. యదువంశం గొప్పతనాన్ని చెప్పడానికి భగవద్గీత విభూతి యోగంలో కృష్ణుడిని విభూతి అన్నారు. కృష్ణుడు యదువంశానికి పరిమితుడు కాదు.

సూత్రము 53: ప్రత్యభిజ్ఞానాచ్చ

తాత్పర్యము: విశేషాన్ని (customized) విడిచిపెట్టి సామాన్య (common) ధర్మాన్ని చూడు. అవతార విశేష లక్షణాలను విడిచి రాముడు కృష్ణుడు సత్ చిత్ అన్న సామాన్య ధర్మాన్ని చూడు.

సూత్రము 54: వృష్ణీశు శ్రేష్ట్యేన తత్

తాత్పర్యము: యదువంశం గొప్పతనాన్ని చెప్పడానికి భగవద్గీత విభూతి యోగంలో కృష్ణుడిని విభూతి అన్నారు. కృష్ణుడు యదువంశానికి పరిమితుడు కాదు.

సూత్రము 55: ఏవం ప్రశిద్ధేషు చ

తాత్పర్యము: పరమాత్మను పట్టుకున్న గురువుని (బ్రహ్మ నిష్ఠ కలిగిన గురువులను) పట్టుకున్నా ముక్తి లభిస్తుంది.

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------





## ద్వితీయ అధ్యాయము

## ద్వితీయ ఆహ్నికం

**సూత్రము 56: భక్త్యా భజనోపసంహారాత్ గౌణ్యా పరాయే తద్ధేతుత్వాత్**

**తాత్పర్యము: గౌణ్యభక్తిలో ఏవేవి ప్రయత్నపూర్వకముగా చేస్తామో, పరాభక్తికి చేరినవాడు అవే అప్రయత్నముగా (స్వాభావికంగా) చేస్తాడు. గౌణభక్తి పరాభక్తికి కారణమవుతుంది. భగవద్గీత రాజవిద్యారాజగుహ్యయోగములోని 14 శ్లోకము ప్రమాణము.**

సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః ।
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ||

**సూత్రము 57: రాగార్థ ప్రకీర్తి సాహచర్యాత్ చ ఇతరేశామ్**

**తాత్పర్యము: కీర్తనముతో పాటు గౌణభక్తిలోని మిగిలినవన్నీ (మననం, శ్రవణం మొదలగునవి) అనురాగ (పరాభక్తి) సిద్ధికోసము చేయాలి. భగవద్గీత విశ్వరూపసందర్శనయోగములోని 36 శ్లోకము ప్రమాణము.**

అర్జున ఉవాచ-
స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ |
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి
సర్వే నమస్యన్తి చ సిద్ధసఙ్ఘాః||

**సూత్రము 58: అంతరాలె తు శేషా: స్యురుపాస్యాదప్ చ ఖండత్వాత్**

**తాత్పర్యము: ఉపనిషత్తులలో, వేదాంతమంతా పరమాత్మ ప్రాప్తి గురించి గౌణ్య భక్తి ప్రాధాన్యతను మొదటి నుంచి చివరిదాకా చెప్తున్నాయి.**

**సూత్రము 59: తాభ్యహ్ పావిత్ర్యం ఉపక్రమాత్**

**తాత్పర్యము: గౌణభక్తి పాపాలను పోగొట్టి చిత్తాన్ని శుద్ధం చేసి పవిత్రులను చేస్తుంది.**

**సూత్రము 60: తాసు ప్రధాన యోగాత్ ఫలాధిక్యమేకే**

**తాత్పర్యము: అందరు సంకీర్తనలు, పూజలు చేస్తున్నప్పటికీ కొందరు భక్తితో చేస్తారు. భక్తితో చేయడము వలన ఆ కొందరికి అధిక ఫలం లభిస్తుంది.**

సూత్రము 61: నామ్నేతి జైమిని: సంభవాత్

తాత్పర్యము: పరమాత్మ కోసము చేసే సాధన అంగములలో నామము గొప్పది అని జైమిని ఋషి అన్నారు. నామము అంటే పరమాత్మ రూప గుణ లీల తత్వ సంకీర్తనలు కూడా.

సూత్రము 62: అత్ర అంగప్రయోగానాం యథాకాల సంభవహో గృహాదివత్

తాత్పర్యము: సాధన ఇలానే చేయాలి ఇలా చేయకూడదు అని నియమాలు లేవు. శాస్త్ర పద్ధతిలో దేశ, కాల, మనసును అనుసరించి చేసుకోవచ్చు. ఇదే క్రమము అని సాధన అంగములకు లేదు. గృహ నిర్మాణము వలే సాధన అంగములు చేసుకోవాలి. పూజ తరవాతే జపము ఆ తరవాతే సంకీర్తన అని నియమాలు లేవు.

సూత్రము 63: ఈశ్వర తుష్టే: ఏకోపి బలి

తాత్పర్యము: ఈశ్వరుణ్ణి తృప్తి పరచడానికి గౌణభక్తి అంగములలో ఏ ఒక్కటి అయినా బలముగా పనిచేస్తుంది. మిగిలినవి వదిలేయకుండా ఒక్క దాంట్లో ఎక్కువ రమిస్తారు భక్తులు. త్యాగయ్య సంకీర్తనతో ఎక్కువగా రమించినా మిగిలిన గౌణభక్తి అంగములను విడిచిపెట్టలేదు.

**సూత్రము 64: అబంధోర్పణస్య ముఖం (సుఖం)**

**తాత్పర్యము: ఏ సాధన చేసినా అర్పణము చేస్తే ఆ బంధనము నుంచి బయటపడతాము, కర్మ చేసినపుడు ఉండే దోషాలు కూడా పోతాయి. అర్పణతోనే కర్మగానీ సాధనగానీ సంపూర్ణముగా చేసినట్టు అవుతుంది. భగవద్గీత శ్రద్ధాత్రయవిభాగయోగములోని 23 శ్లోకము ప్రమాణము.**

ఓం తత్సదితి నిర్దేశః     బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ     యజ్ఞాశ్చ విహితాః పురా ||

**భగవద్గీత భక్తియోగములోని 2 శ్లోకము ప్రమాణము.**

**శ్రీ భగవానువాచ**

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।

శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥2॥

**సూత్రము 65: ధ్యాన నియమస్తు దృష్ట సౌకర్యాత్**

**తాత్పర్యము: ధ్యానానికి ఇదీ పద్ధతి అని లేదు. శాస్త్రము నియమించిన ఏ పద్ధతిలోనైనా సౌకర్యము చూసుకొని చేయవచ్చు.**

సూత్రము 66: తద్యజి: పూజాయామ్ ఇతరేశామ్ తు నైవం

తాత్పర్యము: స్వధర్మాన్ని ఆచరిస్తూ ఈశ్వర ఆరాధన ప్రేమగా చేస్తే పరమాత్మ అనుగ్రహము పొందుతాడు. ఈశ్వర ఆరాధన కంటే గొప్ప మార్గము లేదు. భగవద్గీత రాజవిద్యారాజగుహ్యాయోగములోని 34 శ్లోకము ప్రమాణము.

మన్మనా భవ మద్భక్తః మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ||

సూత్రము 67: పాదోదకస్తు పాద్య మవ్యాప్తే:

తాత్పర్యము: ఈశ్వరుని పాదోదకం, తీర్థము, అభిషేక జలము సర్వ కాలములలో పాపాలను పోగొట్టి పవిత్రులను చేస్తాయి. ఈశ్వరున్ని ఆరాధించే పాదోదకం గొప్పది.

సూత్రము 68: స్వయమర్పితం గ్రాహ్యం అవిశేషాత్

తాత్పర్యము: భగవంతునికి అర్పించినవి పరమాత్మకు వేరు కాదు అనే భావముతో పుచ్చుకోవాలి. తాను భగవంతునికి అర్పించింది తానూ

పుచ్చుకోవచ్చు, పుచ్చుకోవాలి. భగవద్గీత కర్మయోగములోని 13 శ్లోకము ప్రమాణము.

యజ్ఞశిష్టాశినః సన్తః   ముచ్యన్తే సర్వకిల్బిషైః|
భుఞ్జతే తే త్వఘం పాపాః   యే  పచన్త్యాత్మకారణాత్ ||

సూత్రము 69: నిమిత్త గుణ వ్యపేక్షనాద్ అపరాధేషు వ్యవస్థా

తాత్పర్యము: ఆరాధన చేసేటపుడు పద్ధతి తెలుసుకొని చేయాలి లేదంటే దోషం వస్తుంది. దోషము మూడు రకాలు. 1) నిమిత్త - భ్రమపడి విశ్వసించలేదు. 2) గుణ - గుణముతో కలిగిన దోషం. ఉదాహరణ: కోపముగా పూజ చేయడం. 3) అవ్యపేక్షణ - స్వభావముతో కూడిన దోషము. ఉదాహరణ: కోపిష్టి వ్యక్తి.

సూత్రము 70: పత్రాదేర్దానమన్యథా హి వైశిష్ట్యం

తాత్పర్యము: శ్రద్ధగా సమర్పించినపుడు తక్కువ విలువ ఉన్నది కూడా తగిన ఫలం ఇస్తుంది. వ్యవహారంలో పుష్పం కంటే పత్రం తక్కువది అయినా శ్రద్ధగా సమర్పిస్తే తగిన ఫలం ఇస్తుంది. భగవద్గీత రాజవిద్యారాజగుహ్యయోగములోని 26 శ్లోకము ప్రమాణము.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత ప్రయతాత్మనః ||

సూత్రము 71: సుకృతజత్వాత్ పర హేతు భావాచ్చ క్రియాసు శ్రేయస్య:

తాత్పర్యము: గౌణభక్తి అంగములు అయిన పూజ, వ్రతము, దానము, జపము, ధ్యానము మొదలగునవి పూర్వజన్మ పుణ్యఫలం కారణంగానే ఈ జన్మలో చేయగలిగే అవకాశం దొరికింది. ఇవన్నీ కూడా శ్రేయస్కరములే, వీటిలో ఏది గట్టిగా పట్టుకున్నా (మిగిలినవి విడిచిపెట్టకుండా) క్రమముగా ముక్తి లభిస్తుంది.

సూత్రము 72: గౌణం త్రైవిధ్యం ఇతరేన స్తుత్యర్థత్వాత్ సాహచర్యం

తాత్పర్యము: గౌణ భక్తి నాలుగు రకాలు - ఆర్తి, జిజ్ఞాస, అర్థార్థి, జ్ఞానం. ఈ నాలుగూ గొప్పవే. వీటిలో జ్ఞాన భక్తి మరింత గొప్పది.

ఆర్తి – పీడ, బాధ, వేదన ఉన్నపుడు నారాయణుని ఆశ్రయించడం.

జిజ్ఞాస - స్వధర్మం ఆచరిస్తూ గురు శుశ్రూష చేస్తూ భగవంతుని మీద ప్రేమతో తెలుసుకోవాలి అని ఆశ్రయించడం.

అర్థార్థ భక్తి - జిజ్ఞాస ఉంటూ భోగాలు కూడా కావాలి అని పరమాత్మను ఆశ్రయించడం.

జ్ఞాన - నిరంతరము పరమాత్మ శ్రవణ మననములు ప్రీతితో ఆచరించడం.

భగవద్గీత జ్ఞానవిజ్ఞానయోగములోని 16 & 17 శ్లోకములు ప్రమాణము.

చతుర్విధా భజన్తే మాం   జనాః సుకృతినోఽర్జున|
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ   జ్ఞానీ చ భరతర్షభ ||

తేషాం జ్ఞానీ నిత్యయుక్తః   ఏకభక్తిర్విశిష్యతే|
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్   అహం స చ మమ ప్రియః||

సూత్రము 73: బహిరంతస్థం ఉభయమవేష్టి సవనవత్

తాత్పర్యము: గౌణభక్తి అంగములు పరాభక్తికి కూడా అంగములే. అంతరంగ సాధనకు బహిరంగ సాధనకు ప్రేమ అవసరము.

సూత్రము 74: స్మృతి కీర్త్యో: కథా దేశ్చ ఆర్తౌ ప్రాయశ్చిత్త భావాత్

తాత్పర్యము: స్మరించడం, కీర్తించడం, కథ వినడం, అర్చన చేయడం ఇవన్నీ ప్రాయశ్చిత్తం కిందకి వస్తున్నాయి. గౌణభక్తి సాధన పాపం పోవడం కోసం చిత్తం శుద్ధం అవ్వడం కోసం చేయాలి.

సూత్రము 75: భూయసాం అనుష్ఠితిరితి చేత్ ఆప్రయాణం ఉపసంహారాన్ మహత్స్వపి

తాత్పర్యము: నామస్మరణతో ప్రాయశ్చిత్తం జరిగితే ఇంక శాస్త్రంలో చెప్పిన అనేక ప్రాయశ్చిత్త కర్మలు ఎందుకు? అంటే, నామముతో ప్రాయశ్చితమవుతుంది అని నమ్మని వారికి శాస్త్రములో చెప్పిన వివిధ ప్రాయశ్చిత్త కర్మలు చెప్పారు. అనేక జన్మల పుణ్య ఫలము వలన నామముతో ప్రాయశ్చితమవుతుంది అని నమ్ముతాడు. ప్రాయశ్చిత్త కర్మ ఎంత కష్టమో నామముతో ప్రాయశ్చిత్తము కూడా అంతే కష్టము.

పశ్చాత్తాపము ప్రాయశ్చిత్తము కాదు.

1. తప్పుచేసాను అని ఏడిస్తే పావు భాగము పాపము పోతుంది.
2. ఇకపై చేయను అని ఏడిస్తే పావు భాగము పాపము పోతుంది.
3. సత్కర్మ చేస్తా అని సంకల్పించుకుంటే ముప్పావు భాగము పాపము పోతుంది.
4. సత్కర్మాచరణ చేస్తే పూర్తిగా పాపము తొలగిపోతుంది.

భయ పెట్టడం, జాగ్రత్త చెప్పడం కోసం, ఎలా పడితే అలా చేయకుండా

అభయమివ్వడం, ధైర్యం కోసం, ఏ కొద్దిపాటి చేసినా తరిస్తావు అని

సూత్రము 76: లబ్ధవపి భక్తాధికారే మహత్ క్షేపకం అపర సర్వహానాత్

తాత్పర్యము: సామాన్య భక్తి కాసింత దొరికిన మహా పతకాలను పోగొడుతుంది. గౌణభక్తి ఆచరిస్తే పాపమే కాదు పాప వాసన కూడా పోతుంది అని అభయము ఇస్తున్నారు. భగవద్గీత సాంఖ్యయోగములోని 40 శ్లోకము ప్రమాణము.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే |
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్||

సూత్రము 77: తత్ స్థానత్వాత్ అనన్య ధర్మ: ఖలేవాలివత్

తాత్పర్యము: నిరంతరము పరమాత్మను అంటిపెట్టుకోవడం వలన ప్రాయశ్చిత్త జరిగి పాపాలు పోతాయి. నీచ జన్మలు ఎత్తిన వారు కూడా పరమాత్మను పట్టుకుంటే తరిస్తారు. నీచ జన్మలు అంతే ఎప్పుడూ నిందపడే వారు, ఆరాధన చేయడానికి తగిన అర్హత లేక అవయవ శక్తి లేనటువంటి వారు, పరమాత్మ కొరకై సాధనకు దూరము అయ్యినవారు.

సూత్రము 78: ఆనింద్య యోన్యధిక్రియతే పారంపర్యాత్ సామాన్యవత్

తాత్పర్యము: ఎన్నో పాపాలు చేస్తే వచ్చిన జన్మ అయినప్పటికీ భక్తి సాధన వలన మిగిలిన వారి వలే తరిస్తాడు.

సూత్రము 79: అతో హ్యావి పక్వ భావానామపి తల్లోకే

తాత్పర్యము: గౌణభక్తి సాధన సంపూర్ణం కాలేదు, ఇంకా పరాభక్తి రాలేదు, ఇటువంటి స్థితిలో మరణిస్తే వారిని పరమాత్మ తన లోకానికి తీసుకువెళ్లి పరాభక్తి సాధన చేయించి క్రమముగా ముక్తిని ఇస్తాడు.

సూత్రము 80: క్రమైక గత్యుపపత్తేస్తు

తాత్పర్యము: పైన చెప్పిన దానికి అనేక శాస్త్ర ప్రమాణాలు ఉన్నాయి.

సూత్రము 81: ఉత్క్రాంతి స్మృతి వాక్య శేషాచ్చ

తాత్పర్యము: నిరంతరము ఊర్ధ్వ దృష్టి కలిగి ఎవరు ఉపాసన చేస్తారో (గౌణ భక్తులు) వారు ప్రయాణకాలములో అర్చిరాది మార్గము ద్వారా తిరిగిరాని లోకానికి వెళ్తారు. భగవద్గీత అక్షరపరబ్రహ్మయోగములోని 24 శ్లోకము ప్రమాణము.

అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్|
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ||

**సూత్రము 82: మహా పాతకినాం త్వార్తౌ**

**తాత్పర్యము: మహాపాతకాలు చేసినవారికి అర్థభక్తి విషయములోనే అర్హత ఉంది.**

**సూత్రము 83: సైకాంత భావో గీతార్థ ప్రత్యభిజ్ఞానాత్**

**తాత్పర్యము: పరాభక్తి మరియు ఐకాంతభక్తి ఒక్కటే అని భగవద్గీతలో స్వామి గుర్తు చేసారు. స్వామి తప్ప ఇంకొకటి లేదు అన్నది ఏకాంత భక్తి. అదియే పరాభక్తి! భగవద్గీత కర్మసన్యాసయోగములోని 17 శ్లోకము ప్రమాణము.**

తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః |
గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ||

**సూత్రము 84: పరాం కృత్త్వైవ సర్వేషామ్ తథా హ్యా:**

**తాత్పర్యము: గౌణభక్తి బలపడితే పరాభక్తి లభిస్తుంది. పరమాత్మయందు పరాభక్తితో ఉన్నవాడు పరమాత్మనే పొందుతున్నాడు. భగవద్గీత మోక్షసన్యాసయోగములోని 68 శ్లోకము ప్రమాణము.**

య ఇమం పరమం గుహ్యం   మద్భక్తేష్వభిధాస్యతి|
భక్తిం మయి పరాం కృత్వా   మామేవైష్యత్యసంశయః||

---

---





# తృతీయ అధ్యాయము

## ప్రథమ ఆహ్నికం

**సూత్రము 85: భజనీయేన అద్వితీయమిదం కృత్స్న స్య తత్స్వరూపత్వాత్**

**తాత్పర్యము: సమస్తము భగవంతుని స్వరూపము, భగవంతునికి వేరు కాదు అని భజించడమే గొప్ప భక్తి. ఇదే జ్ఞాన భక్తిలో ప్రధానం.**

**సూత్రము 86: తచ్ఛక్తిర్మాయా జడ సామాన్యాత్**

**తాత్పర్యము: అంతటా ఉన్న పరమాత్మ తన స్వశక్తిని జడమైన జగత్తులోకి ప్రవేశింపచేయగానే అది చైతన్యము పొందింది.**

**సూత్రము 87: వ్యాపకత్వాద్ వ్యాప్యానామ్**

**తాత్పర్యము: ప్రకృతి అంతా పరమాత్మయే వ్యాపించి ఉన్నాడు. భగవద్గీత జ్ఞానవిజ్ఞానయోగములోని 19 శ్లోకము ప్రమాణము.**

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే|
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ||

**సూత్రము 88: న ప్రాణి బుద్ధిభ్యో అసంభవాత్**

**తాత్పర్యము: జీవుల బుద్ధి వలే పరమాత్మ బుద్ధి ఉండదు.**

**సూత్రము 89: నిర్మాయోచ్చావచం శృతిశ్చ నిర్మిమీతే పితృవత్**

**తాత్పర్యము: జీవులు బాగుపడటం కోసం వేదాలు ఇచ్చారు పరమాత్మ ఒక తండ్రి వలె.**

**సూత్రము 90: మిశ్రోపదేశాన్నేతి చేన్న స్వల్పత్వాత్**

**తాత్పర్యము: వేదములో ఏవైనా పరస్పర విరుద్ధముగా కనిపిస్తే అవి స్వల్పములే, ప్రధాన అర్థము ఒక్కటే.**

**సూత్రము 91: ఫలమస్మాద్ బాదరాయణో దృష్టత్వాత్**

తాత్పర్యము: అంతటా బ్రహ్మమునే చూచుట వలన ఉత్కృష్ట ఫలం ఉంటుంది అని బాదరాయణుడు చెప్పారు.

సూత్రము 92: వ్యుత్క్రమాద్ అప్యయస్తథా దృష్టం

తాత్పర్యము: వ్యాపించిన ఈ జగత్తు వ్యాపకరూపమైన పరమాత్మయందు లీనమవుతుంది. భగవద్గీత అక్షరపరబ్రహ్మయోగములోని 18, 19, 20 శ్లోకములు ప్రమాణము.

అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే|
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే ||

భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే|
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే ||

పరస్తస్మాత్తు భావోఽన్యః అవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః|
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ||

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------



## తృతీయ అధ్యాయము

## ద్వితీయ ఆహ్నికం

**సూత్రము 93: తదేక్యం నానాత్వైకత్వముపాధియోగహానా ఆదిత్యవత్**

**తాత్పర్యము: ఉపాధి వలన అనేక శరీరాలు కనపడుతున్న ఉన్నది ఒక్కటే పరమాత్మ. భగవద్గీత క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగములోని 33 శ్లోకము ప్రమాణము.**

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ||

**సూత్రము 94: పృథగ్గ ఇతి చేన్న పరేనాసంబంధాత్ ప్రకాశానాం**

**తాత్పర్యము: ఈశ్వరుడి వలన జీవుడు ప్రకాశిస్తున్నాడు.**

**సూత్రము 95: న వికారిణస్తు కారణ వికారాత్**

తాత్పర్యము: కనపడుతున్న వికారాలు జీవుడివి కావు. మనసు, ఇంద్రియ ఉపాధి వికారాలు.

**సూత్రము 96: అనన్య భక్త్యా తద్ బుద్ధి: తద్ బుద్ధిలయాద్ అత్యంతం**

తాత్పర్యము: అనన్యభక్తి చేత పైన చెప్పినది అనుభవంలోకి వస్తుంది. అప్పుడు పరమాత్మ తప్ప మరొకటి లేదు అనే బుద్ధి కూడా పరమాత్మలోనే లయం అవుతుంది.

**సూత్రము 97: ఆయుశ్చిరమితరేషామ్ తు హానిరణాస్పదత్వాత్**

తాత్పర్యము: ఈ స్థితి (పైన చెప్పినది) కలిగిన జీవన్ముక్తుడికి ప్రారబ్ద కర్మ చేత చాలా కాలం శరీరం ఉండచ్చు కానీ ఎటువంటి హాని కలగదు.

**సూత్రము 98: సంసృతిరేషామభక్తేస్యానాజ్ఞానాత్ కారణాసిద్ధే:**

తాత్పర్యము: సంసారం (జన్మ) అజ్ఞానము వలన రాలేదు. భక్తి లేకపోవడం వలన వచ్చింది.

### సూత్రము 99: త్రీణ్యేశాస్ నేత్రాణి శబ్ద లింగాక్షి భేదాత్ రుద్రవత్

తాత్పర్యము: త్రినేత్రుడు లాగా మూడు కళ్ళు పెట్టుకుంటే జ్ఞానం కలుగుతుంది.

1. శబ్ద - శాస్త్ర ప్రమాణము. గురువు చెప్పినది నమ్మి సాధన చేయాలి.

2. లింగ - అనుమాన ప్రమాణము - కనపడుతున్నదాని ద్వారా కనపడని దాన్ని గ్రహించటం. శాస్త్రము చెప్పినది యుక్తితో తెలుసుకోవాలి.

3. అక్షి - ప్రత్యక్ష ప్రమాణం - ఎదురుగా కనపడుట. ప్రత్యక్షంగా అనుభవంతో తెలుసుకొనుట.

### సూత్రము 100: ఆవిస్తరో భావా వికారాస్యు: క్రియాఫలసంయోగాత్

తాత్పర్యము: సృష్టి కలిగింది, పెరిగింది, లీనమైంది. ఇదంతా పరమాత్మలోనే జరిగింది, పరమాత్మ ద్వారానే జరిగింది. క్రియ వలన సృష్టి కలిగినట్టు, పెరిగినట్టు, లీనమయినట్టు వేరు వేరుగా కనపడుతోంది. పరమాత్మ కనపడడు. ఎప్పుడు ఉండేది పరమాత్మ ఒక్కడే. పరమాత్మకు లేకపోవడం అన్నది లేదు. సృష్టికి ఎప్పుడూ ఉండడం అన్నది లేదు. ఉన్నట్టు కనిపించినా సృష్టికి ఉండే లక్షణము లేదు. లేనట్టు అనిపించినా

పరమాత్మకు ఉండే లక్షణము ఉంది. భగవద్గీత సాంఖ్యయోగములోని 16 శ్లోకము ప్రమాణము.

నాసతో విద్యతే భావః నాభావో విద్యతే సతః |
ఉభయోరపి దృష్టోఽన్తః త్వనయోస్తత్త్వదర్శిభిః ||

---

---



పరమాత్మ ప్రేమయే ప్రపంచమయింది. అంతటా ప్రేమయే నిండిపోయింది. పరమాత్మ ప్రేమ (కరుణ) కిందన పడింది ధార లాగా.  మన ప్రేమ (భక్తి) పైకి పరమాత్మ వైపు వెళ్తోంది రాధ అయి.

**నారాయణ తీర్థులు:**

ఏతత్ సర్వ కథనం కారణేన ఈశ్వరేణ కార్యస్య అభేద సంపత్తయే తస్మిన్ సచ్చేన బ్రహ్మజ్ఞానాత్ సర్వజ్ఞానేనవైరాగ్యాత్ అనన్యభక్త్యా భగవత్ ప్రాప్తి: సంభవాత్ ఇత్యాస్థాస్ విస్తర:

భావము: ఈ చెప్పిన సారము ఏమిటి అంటే కారణమైన ఈశ్వరుడు కార్యమైన జగత్తు ఒక్కటే అని తెలుసుకొని, ఆ జ్ఞానము చేత వైరాగ్యము పొంది, అంతా ఆయనే అని తెలిసాక ఒకదాని యందు ప్రీతి మరొక దానియందు ద్వేషము పోయి, ఉన్న పరమాత్మ మీద పరమప్రీతి కలిగి, భగవత్ ప్రాప్తి లభిస్తుంది. అందుకని ఇంత విస్తారముగా చెప్పారు.

శాండిల్య మహర్షికి, స్వప్నేశ్వరాచార్యులకు, నారాయణ తీర్థులకు

పాదాభివందనములు

పూజ్య గురుదేవులు శ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారికి

పాదాభివందనములు

సర్వం శ్రీరాధాకృష్ణ చరణార విందార్పణమస్తు

